సాక్షి ఆదిలాబాద్

శనివారం, 9, నవంబర్, 2024



సైబర్ చోరులు

జిల్లాలో సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. మ్యాట్రీమోని, పార్ట్‌టైం ఉద్యోగాలు, క్రిప్టో ప్రకటన అంటూ మోసాలకు పాల్పడుతున్నారు. డబ్బులు దోచేస్తున్నారు. 8లో▸

అట్టహాసంగా నెట్‌బాల్ పోటీలు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్‌-16 సబ్ జూనియర్స్ నెట్ బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.1/17.8

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు మంచు కురుస్తుంది.

కొనుగోళ్లు నామమాత్రం!

- జిల్లాలో 11 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- నార్నూర్ మినహా మిగితావి ప్రారంభం
- అంతంత మాత్రంగానే సాగుతున్న పత్తి కొనుగోళ్లు
- గత్యంతరం లేక తక్కువ ధరకే విక్రయిస్తున్న రైతులు



ఆదిలాబాద్ మార్కెట్‌లో నిర్వహిస్తున్న పత్తి వేలం (ఫైల్)



ఆదిలాబాద్ మార్కెట్‌కు వచ్చిన పత్తి బండ్లు (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: భారత పత్తి సంస్థ (సీసీఐ) ఈ సీజన్‌లో జిల్లాలో 11 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. గత అక్టోబర్ 25న ఆదిలాబాద్‌లో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించి కొనుగోళ్లు సైతం చేపట్టారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నిచోట్ల సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించడంతో జిల్లాలో వడివడిగా ఒక నార్నూర్ మినహా మిగితా అన్ని కేంద్రాలను ప్రారంభించారు. పేరుకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ఆదిలాబాద్‌లో మినహా మిగితా చోట్ల సీసీఐ కొనుగోళ్లు నామమాత్రంగా జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

నార్నూర్ మినహా..

జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో రెండు, బోథ్, నేరడిగొండ, పొచ్చర, సొనాల, ఇంద్రవెల్లి, నార్నూర్, గుడిహత్నూర్, ఇచ్చోడ, బేల ఒక్కొక్కటి చొప్పున కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేశారు. మొదట్లో ఆదిలాబాద్‌లోని రెండు కేంద్రాలను ప్రారంభించి స్వల్పంగా పత్తి కొనుగోళ్లు చేపట్టారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు జిల్లాలో నార్నూర్ మినహా మిగితా అన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే ఆదిలాబాద్ మినహా మిగితా కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి.

అంతా ప్రైవేట్‌కే..

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ అలంకారప్రాయంగా ఉన్నాయన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో పత్తికి మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.7521గా ప్రకటించింది. సాధారణంగా పత్తికి మద్దతు ధర లభించని పక్షంలో సీసీఐ అండగా ఉంటుందని చెప్పే ప్రభుత్వాల మాటలకు కొనుగోలు కేంద్రాల తీరుకు పొంతన కుదరడం లేదు. తేమ సాకుతో సీసీఐ రైతుల నుంచి నామమాత్రంగా పత్తిని కొనుగోలు చేస్తోంది. ఇక ప్రైవేట్ వ్యాపారులు తేమ నెపంతో అమాంతం ధర తగ్గించి రైతుల నడ్డి విరుస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు లక్ష క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరగ్గా, అందులో సీసీఐ 35 శాతం వరకు కొనుగోలు చేసింది. మిగితా అంతా ప్రైవేట్ వ్యాపారులే కొన్నారు. 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. దీంతో కొంత మంది రైతులకు మాత్రమే మద్దతు ధర దక్కింది. ఇక పత్తిలో తేమ శాతం అధికంగా ఉన్న రైతులు ప్రైవేట్ వ్యాపారులకే పత్తిని విక్రయించారు. ప్రైవేట్‌లో మెజార్టీ రైతులకు కనిష్టంగా క్వింటాలుకు రూ.6,406, గరిష్టంగా రూ.7040 మాత్రమే దక్కింది. రైతులు గత్యంతరం లేని పరిస్థితిలో మార్కెట్‌లో పత్తిని విక్రయించి వెనుదిరుగుతున్నారు.

జిల్లాలో పత్తి కొనుగోళ్ల వివరాలు..

ఇప్పటివరకు కొనుగోలు చేసిన పత్తి	99,965 క్వింటాళ్లు
సీసీఐకి విక్రయించిన రైతుల సంఖ్య	1780
సీసీఐ కొన్న పత్తి	35,835 క్వింటాళ్లు
ప్రైవేట్‌కు విక్రయించిన రైతుల సంఖ్య	3388
వ్యాపారులు కొనుగోలు చేసింది	64,130 క్వింటాళ్లు

సీసీఐ కొనుగోలు చేస్తోంది..



జిల్లాలో ఇప్పటివరకు సీసీఐకి సంబంధించి 10 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. నార్నూర్‌లో మొదలుపెట్టాల్సి ఉంది. రైతులు పత్తిని ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకురావాలి. 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తిని సీసీఐ మద్దతు ధరతో కొనుగోలు చేస్తోంది.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి

న్యూస్‌రీల్

పోలీసులకు మాబ్ ఆపరేషన్ డ్రిల్



శిక్షణ ఇస్తున్న పోలీసు అధికారి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి మాబ్ ఆపరేషన్ డ్రిల్, లాఠీ డ్రిల్ శిక్షణ ఇచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎక్కువ మంది గుమిగూడినప్పుడు వారిని చెదరగొట్టేందుకు ఏవిధంగా చర్యలు చేపట్టాలనే విషయాలపై అవగాహన కల్పించారు. లాఠీని ఏ విధంగా ఉపయోగించాలనే అంశాల గురించి వివరించారు. వన్‌టౌన్, టూటౌన్, మహిళా పోలీస్‌స్టేషన్‌ల సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈవో ప్రణీత



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

తలమడుగు: పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ప్రశ్నలకు సమాధానం చెప్పే విధంగా సిద్ధం కావాలన్నారు. వంద శాతం విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. జిల్లాలోని ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 18 వరకు, రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 21 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

నేడు యథావిధిగా పత్తి కొనుగోళ్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సీసీఐ, ప్రైవేట్ వ్యాపారుల ద్వారా పత్తి కొనుగోళ్లు యథావిధిగా జరుగుతాయని కలెక్టర్ రాజర్షిషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతులు శనివారం తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆయన సూచించారు.

పత్తి పంట క్షేత్ర పరిశీలన



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎదులాపురం: కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ, నాగ్‌పూర్ సహకారంలో నిర్వహించనున్న 'అధిక సాంద్రత పద్ధతి పత్తి సాగు' క్షేత్రపరిశీలన శుక్రవారం చేపట్టారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడ గ్రామ రైతు వెంకటి పత్తి చేనులో ఈ పద్ధతిలో పంట పండించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు రాజశేఖర్, మోహన్‌దాస్ మాట్లాడుతూ ఈ అధిక సాంద్రత పద్ధతి పత్తి సాగు చేయడం వల్ల ఎకరానికి 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి పెరిగి, గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గించడానికి, పత్తి తర్వాత మరో పంట వేసుకోవడానికి ప్రయోజనాలు చేకూరతాయన్నారు. ఇందులో శాస్త్రవేత్త శివచరణ్, విత్తన సంస్థ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలి

- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత మూడేళ్లకు సంబంధించిన దర్యాప్తు ఫైళ్లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, ఎలాంటి కేసులు వస్తున్నాయి.. వాటిని ఏవిధంగా పరిశీలిస్తున్నారు.. దర్యాప్తు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన మహిళల ఫిర్యాదులను స్వీకరించి ఆయా పోలీస్‌స్టేషన్‌లకు కేసులను ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. మదర్ ఫీడింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, మహిళలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై ఎస్‌హెచ్‌వోను అభినందించారు. డీఎస్పీ వెంట మహిళ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్, ఏఎస్సైలు రహెమాన్ ఖాన్, అనిత, పోలీసు సిబ్బంది ధన్‌లాల్, విఠల్, లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులను ఇన్నోవేషన్ మారథాన్‌లో దరఖాస్తులు చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని డీఈవో ప్రణీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుంచి 12వ తరగతుల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులు పంపించాలని, పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రఘురమణను 94400 60288 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆటల బడిపై అలసత్వం



ట్రాక్, షూస్ లేకుండా ఆడుతున్న విద్యార్థులు

- అధ్వానంగా క్రీడాపాఠశాల దుస్థితి
- క్రీడాకిట్లు లేక విద్యార్థుల అవస్థలు
- అరకొర వసతుల మధ్య సాధన

ఆదిలాబాద్: రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దాలనే ధ్యేయంతో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆదిలాబాద్ క్రీడా పాఠశాలపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకుంటున్నాయి. చదువుతోపాటు క్రీడారంగంలో తమ విద్యార్థులు గొప్పగా ఎదుగుతారనే తల్లిదండ్రుల ఆకాంక్షలు నీరుగారిపోతున్నాయి. రాష్ట్రంలో హకీంపేటలో ప్రధాన క్రీడా పాఠశాల ఉండగా, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో ప్రాంతీయ క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేశారు. హకీంపేట, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూళ్ల నిర్వహణ ఎంతో కొంత మెరుగ్గా ఉండగా, జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల ఆదిలాబాద్ పాఠశాల పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా దర్శనమిస్తున్నాయి. వసతుల లేమి, క్రీడా పరికరాలు, కిట్లు లేకపోవడం, శిక్షకుల కొరతతో విద్యార్థులు అనుకున్న స్థాయిలో క్రీడల్లో రాణించలేకపోతున్నారు. మరోవైపు వివాదాలు క్రీడా పాఠశాల ప్రతిష్టను మసకబారుస్తున్నాయి.

కరువైన స్పోర్ట్స్ కిట్లు..

క్రీడా పాఠశాలలో విద్యా బోధన చేస్తూనే క్రీడల్లో రాణించేలా శిక్షణ అందిస్తున్నారు. క్రీడా పాఠశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయంలో వ్యాయామం, క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం వారికి స్పోర్ట్స్ కిట్లను అందిస్తారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు లేకపోవడం గమనార్హం. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, వారి పోషకులు తమ సొంత డబ్బులతో స్పోర్ట్స్ కిట్లు కొనివ్వాల్సి వస్తుంది. రూ. వేలల్లో విలువచేసే కిట్లను కొనుగోలు చేయాల్సి వస్తుండడంతో తల్లిదండ్రులకు అవస్థలు తప్పడం లేదు. సరైన క్రీడా దుస్తులు, బూట్లు, ట్రాక్‌షూట్స్ వంటివి లేకపోవడంతో సామర్థ్యం మేరకు విద్యార్థులు ప్రతిభ కనబర్చలేని దుస్థితి నెలకొంటుంది.

సాధనకు తప్పని తిప్పలు..

విద్యార్థులకు ప్రస్తుతం అథ్లెటిక్స్, జూడో, బ్యాడ్మింటన్, బాక్సింగ్ వంటి క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. అథ్లెటిక్స్ క్రీడాకారులు స్టేడియంలోని 400 మీటర్ల ట్రాక్‌పైన సాధన చేస్తున్నారు. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామ, నడక సాధకులతో ట్రాక్ నిండిపోతుండడంతో విద్యార్థుల సాధన, శిక్షణకు ఆటంకం కలుగుతుంది. అదే విధంగా బ్యాడ్మింటన్ విద్యార్థులకు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే అక్కడ సైతం అరకొర వసతులు ఉండడం, పలువురు ఉద్యోగులు ఆయా సమయాల్లోనే బ్యాడ్మింటన్ సాధన చేస్తుండడంతో విద్యార్థులకు సరిపడా ప్రాక్టీస్ లభించడం లేదు. దీంతో రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా వేదికలపై కొద్ది మంది క్రీడాకారులు మాత్రమే పతకాలు సాధిస్తున్నారు. ఇక తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాక్సింగ్ రింగులోనే క్రీడాకారులు సాధన చేస్తున్నారు. జూడో క్రీడాకారులకు ప్రస్తుతం ఉన్న మ్యాట్లు సరిపోవడం లే దు. దీంతో విద్యార్థులు భయంభయంగా సాధన చే స్తున్నారు. అయినప్పటికీ జూడో క్రీడాకారులు రా ష్ట్ర, జాతీయస్థాయి వేదికల్లో సత్తా చాటుతూ ఉండ డం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది.

వివాదాలకు కేంద్ర బిందువుగా..

క్రీడా పాఠశాలలో పలు సందర్భాల్లో వివాదాలు చోటు చేసుకోవడం పాఠశాల ప్రతిష్టకు భంగం కలిగిస్తోంది. పాఠశాలలో ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కేటాయిస్తున్నారు. ఇదే అదనుగా పలువురు ఉపాధ్యాయులు పైరవీలు చేస్తూ క్రీడా పాఠశాలలో డిప్యూటేషన్‌పై వస్తున్నారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో ఎన్నోసార్లు వివాదాలు చోటు చేసుకోవడం గమనార్హం. అర్హతలు లేకపోయినప్పటికీ పలువురు డిప్యూటేషన్ కింద పాఠశాలలో విధులు నిర్వర్తించడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని సందర్భాల్లో ఉన్నతాధికారులు విచారణ జరిపి, సదరు ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను సైతం రద్దు చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనే డిప్యూటేషన్ వ్యవహారం జిల్లా కలెక్టర్ వరకు వెళ్లడం, పైరవీలు ఏమేర చోటు చేసుకున్నాయనే విషయాన్ని తేటతెల్లం చేస్తుంది.

విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు



క్రీడా పాఠశాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారికి స్పోర్ట్స్ కిట్స్ అందించేందుకు స్థానికంగా ఏర్పాట్లు చేస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల్లో రెండుసార్లు వారికి స్పోర్ట్స్ కిట్స్ అందజేశాం. ఇటీవలే స్పోర్ట్స్ దినోత్సవం రోజున సైతం కిట్లు అందించాం.

– వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో

ముగిసిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ

- నేటి నుంచి సమగ్ర సర్వే షురూ



స్టిక్కరింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర సర్వేలో భాగంగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఇళ్ల గుర్తింపునకు చివరి రోజు కావడంతో ఆదిలాబాద్ మున్సిపాలిటీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎన్యూమరేటర్లు రాత్రి 8 గంటల వరకు క్షేత్రస్థాయిలో ఇళ్ల స్టిక్కరింగ్ ప్రక్రియను చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,50,384 గృహాలకు గాను 1.40లక్షల గృహాలకు స్టిక్కరింగ్ పూర్తి కాగా మున్సిపాలిటీలో 48,393 ఇళ్లకు గాను 41,860 ఇళ్లకు స్టిక్కరింగ్ పూర్తి చేశారు. అయితే ఆదిలాబాద్ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అధికారులు నిర్దేశించిన దానికంటే ఇళ్ల సంఖ్య అధికంగా పెరుగుతోంది. దీంతో ఎన్యూమరేషన్ బ్లాక్‌ల సంఖ్యను సైతం పెంచాల్సి వస్తోంది. అయితే ఎన్యూమరేటర్లకు అందించిన ఈబీ బ్లాక్‌లు, క్షేత్రస్థాయిలోని ఇళ్లకు ఎలాంటి పొంతన లేకుండా ఉంది. దీంతో హౌస్ స్టిక్కరింగ్‌కు సర్వే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జిల్లా కేంద్రంతో పాటు ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బోథ్, బేల వంటి మండల కేంద్రాల్లో సమస్య అధికంగా తలెత్తింది. ఆయా చోట్ల ఇళ్లను గుర్తించేందుకు ఎన్యూమరేటర్లు శ్రమించాల్సి వచ్చింది.

జిల్లాకు 2.10 లక్షల ప్రశ్నావళి పత్రాలు..

సమగ్ర సర్వేలో కీలకమైన ఘట్టం శనివారం నుంచి మొదలు కానుంది. హౌస్ లిస్టింగ్ గడువు ముగియడంతో ఎన్యూమరేటర్లు ప్రజలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించనున్నారు. ఇందుకు అవసరమైన బుక్‌లెట్‌లతో పాటు ప్రశ్నావళి ఫారాలను స్థానికంగానే ముద్రించుకునేలా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి 2.10 లక్షల ప్రశ్నావళి ఫారాలు, గైడ్‌లైన్స్ బుక్‌లెట్‌లను ప్రింటింగ్ చేసే బాధ్యతలను జిల్లాకు చెందిన ఏడుగురు ప్రింటర్లకు అప్పగించారు. వాటిని హైదరాబాద్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌లల్లో ప్రింటింగ్ చేయించి ప్రత్యేక వాహనంలో జిల్లాకు తరలించారు. జిల్లాకు చేరిన బుక్‌లెట్‌లు, ప్రశ్నావళి ఫారాలను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో భద్రపరిచి ఉదయం 8గంటల్లోపు ఆయా మండలాలకు చేరవేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లుగా జెడ్పీ అధికారులు తెలిపారు. ఒక్కో ఎన్యూమరేటర్ రోజుకు పది ఇళ్లను మాత్రమే సర్వే చేయాల్సి ఉండటంతో శనివారం జిల్లాలోని 2వేల మంది ఎన్యూమరేటర్లకు 20వేల ప్రశ్నావళి ఫారాలు, బుక్‌లెట్‌లు అవసరం కానున్నాయి. ఆదివారంలోగా పూర్తిస్థాయిలో ఫారాలు జిల్లాకు చేరుకోనుండటంతో సమగ్ర సర్వేకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పూర్తిస్థాయిలో వేగంగా సాగేందుకు అవకాశం కలుగుతుంది. ఎన్యూమరేషన్ బ్లాక్‌ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాకు 2.70లక్షల ప్రశ్నావళి ఫారాలు, బుక్‌లెట్లు అవసరమయ్యే అవకాశముంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

నేరుగా సమాచార సేకరణ..

హౌస్‌లిస్టింగ్‌లో స్టిక్కరింగ్ పూర్తికానటువంటి ఇళ్లలో అధికారులు నేరుగా సమాచార సేకరణ చేపట్టనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులో జిల్లాలో సుమారు ఐదారు వేల ఇళ్లకు స్టిక్కరింగ్ జరగలేదు. ఇళ్లకు తాళాలు వేసి ఉండటం, ఈబీ మ్యాప్‌ల ఆధారంగా ఇళ్లు దొరక్కపోవడం వంటి సమస్యల కారణంగా ఇళ్లకు స్టిక్కరింగ్ జరగలేదు. అలాంటి ఇళ్లలో ఎన్యూమరేటర్లు నేరుగా వారి సమాచారాన్ని సేకరించి స్టిక్కరింగ్ చేపట్టనున్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. సర్వే నిర్వహణ తీరుపై మండల టీమ్‌లతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా మూడు రోజులుగా జరుగుతున్న హౌజ్ లిస్టింగ్ సర్వే ముగిసిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా పూర్తి సర్వే నిర్వహించాలని, పొరపాట్లకు, తప్పులకు తావివ్వకుండా సరైన సమాచారాన్ని ఫారంలో నమోదు చేయాలని స్పష్టం చేశారు. స్టిక్కర్ ఇంటింటికీ అతికించే క్రమంలో యజమాని పేరు, వార్డ్ నంబర్, క్రమ సంఖ్య, తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకుని అతికించాలన్నారు. సర్వేలో సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. సర్వేలో ప్రతీ కుటుంబం పాల్గొనేలా విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. సర్వేలో ఏమైనా సందేహాలు, సలహాల నివృత్తికి ప్రత్యేకాధికారులను సంప్రదించాలన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య ఫ్లెక్సీ వార్



కాంగ్రెస్ ఫ్లెక్సీ తొలగిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బోథ్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఫ్లెక్సీ వార్ రాచుకుంది. మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద బీఆర్‌ఎస్ నాయకులు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ ఇటీవల ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎంకు శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీని బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి ఆనుకుని కట్టారు. కాగా పక్కనే ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి కార్యక్రమానికి హాజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తిరుగు ప్రయాణంలో తమ ఫ్లెక్సీ కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీకి ఆనుకుని ఉండటాన్ని గమనించారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించారు. గమనించిన కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసి బీఆర్‌ఎస్ ఫ్లెక్సీని చింపివేశారు. కాగా ఎస్సై ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. కాంగ్రెస్ ఫ్లెక్సీని చింపివేయడం దుర్మార్గమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ మండిపడ్డారు. శనివారం అన్ని మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ధనుష్, దుర్గాప్రసాద్‌లు అండర్‌- 17, ఆదిలాబాద్ జట్టులో చోటు పొందారు. ఈనెల 10 నుంచి 12 వరకు మల్కాజిగిరిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మహేశ్, విజయ, సాయికుమార్ అభినందించారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



మౌనికకు సర్టిఫికెట్ అందజేస్తున్న సిబ్బంది

నార్నూర్: మండల కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని జాదవ్ మౌనిక రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలో (అండర్‌-14 బాలికల విభాగం) ప్రథమ బహుమతి గెలుచుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విట్టల్, పీడీ ఆడే విశ్వనాథ్ తెలిపారు. ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థినికి శుక్రవారం సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రగ్బీ పోటీలకు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బేల: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎ.లఖన్, బి.సాయిచరణ్, ఎం.ప్రదీప్‌లు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి, ఈ నెల 10 నుంచి హైదరాబాద్ మల్కాజిగిరిలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 17 పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ రంగన్న, ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ శివన్న పాల్గొన్నారు.

మునిపల్లి విద్యార్థికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కల్లెడ అభిలాష్

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కల్లెడ అభిలాష్ జాతీయ పురస్కారం అందుకున్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన కల్లెడ పవిత్ర – ప్రసాద్ దంపతుల కుమారుడు అభిలాష్ తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, మాచి రాజు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కథల పోటీల్లో పాల్గొని 'మంచి మనుసు' అనే కథా సంపుటిని రాశారు. ఇందుకు జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నారు. అభిలాష్ జగిత్యాల జిల్లాలోని ఏర్గట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మర్కటోలకు చెందిన కిషోర్‌కుమార్‌కు మంచిర్యాల స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ఉపనిషద్వని ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం మల్లిడి గ్రామానికి చెందిన దుర్గం చంద్రయ్య మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో 2016 అక్టోబర్ 14న రోడ్డుపై లారీ ప్రమాదానికి గురై చనిపోయాడు. అతడి భార్య తలకు గాయమై ఆస్పత్రిలో చేరింది. అప్పటి ఎస్సై అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ప్రమాదానికి కారణమైన కిషోర్‌కుమార్‌కు జైలు శిక్ష విధించారు.

సైబర్ చోరులు

మ్యాట్రీమోని పేరుతో రూ.17లక్షలు



ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, సౌజన్య దంపతులు మ్యాట్రీమోని పేరుతో అందమైన అమ్మాయిల ఫొటోలతో ఫేస్‌బుక్ ఖాతా ఏర్పాటు చేసి ఇతరులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ చేయడం, పెళ్లి సంబంధాల కోసం వివరాలు ఇచ్చిన వారికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టడం, ఫ్రెండ్ రిక్వెస్ట్ అక్సెప్ట్ చేయగానే వారితో చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకుని కొంతకాలం తర్వాత బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేసేవారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన ఓ యువకుడిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేయగా.. దశలవారీగా రూ.17లక్షలు ముట్టజెప్పాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో యువకుడు రామగుండం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు వెంకటనాగరాజు, సౌజన్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగం అంటూ..



ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో నస్పూర్‌లోని రాంనగర్‌కు చెందిన అడెపు శివకుమార్‌తోపాటు తన బంధువులు, స్నేహితులు రూ.1,57,319 సైబర్ మోసగాళ్ల చేతిలో నష్టపోయారు. శివకుమార్ తన ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్ టైం ఉద్యోగం లింక్‌ను ఓపెన్ చేయగా టెలిగ్రామ్ యాప్‌లో సయ్యద్ మెకలిన్ అనే గుర్తు తెలియని వ్యక్తుల ప్రొఫైల్స్‌తోపాటు మరికొందరికి చెందిన ప్రొఫైల్స్ ఓపెన్ అయ్యాయి. కొంత పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పడంతో పలు దఫాలుగా రూ.1,57,319 ఫోన్ పే ద్వారా పంపించారు. సమాధానం రాకపోవడం, ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్రిప్టో మోసం..



క్రిప్టో పేరుతో సీతరాంపల్లి గ్రామానికి చెందిన బొల్లం భీమయ్య రూ.67వేలు నష్టపోయాడు. 2024 అక్టోబర్ 10న తన ఇన్‌స్టాగామ్ యాప్‌లో క్రిప్టో అనే పేజీ ప్రకటనలో రూ.10వేలు పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని చెప్పడంతో భీమయ్య గుర్తు తెలియని వ్యక్తి పంపిన బ్యాంకు ఖాతాకు పలు దఫాలుగా రూ.67వేలు పంపించాడు. సదరు వ్యక్తి నుంచి సమాచారం రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయగా రూ.32వేలు ఫ్రీజ్ చేశారు.

- మ్యాట్రీమోని పేరుతో మోసాలు
- ఓటీపీ చెప్పకపోయినా బ్యాంకు ఖాతా ఖాళీ



మంచిర్యాలక్రైం: ఆధునిక టెక్నాలజీని తమకు అనుకూలంగా మలుచుకుని కొందరు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతూ దోచుకుంటున్నారు. పోలీసు యంత్రాంగం ఎంత అప్రమత్తం చేస్తున్నా ఎక్కడో ఒక చోట మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఝార్ఖండ్‌లోని జమ్‌తార జిల్లాలోని ఏడు గ్రామాలకు చెందిన యువత సైబర్ నేరాలే ప్రధాన ఆదాయ వనరుగా మలు చుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. బ్యాంకుల్లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కాల్‌సెంటర్లు తదితర మార్గాల్లో డెబిట్ కార్డుల డేటా సైబర్ మోసగాళ్లకు చేరుతోంది. బోగస్ పేర్లు, చిరునామాలతో సిమ్‌కార్డులు తీసుకునే జమ్‌తార యువకులు వాటి విని యోగానికి బేసిక్ మోడల్, తక్కువ ఖరీదున్న సెల్‌ఫోన్లు వాడుతుంటారు. వీటితో తమ వద్ద ఉన్న సమాచారంతో బ్యాంకు వినియోగదారులకు ఫోన్ చేస్తుంటారు. ఇటీవల కాలంలో అందరి ఫోన్లలోనూ ట్రూ కాలర్ తరహా యాప్స్ ఉంటున్నాయి. బోగస్ సిమ్‌కార్డుల వినియోగదారులు ముందుగానే ఆయా నంబర్లను సదరు యాప్‌లో 'బ్యాంకు హెడ్ ఆఫీస్' పేరుతో రిజిష్టర్ చేస్తున్నారు. ఫలితంగా ఈ నంబర్ నుంచి ఫోన్ రాగానే బ్యాంకు నుంచి అనే భావన కలిగి తేలిగ్గా బుట్టలో పడుతున్నారు. ప్రతీ లావాదేవీకి ఒక ఓటీపీ కచ్చితంగా ఉండాలి. దీనిని పదేపదే వినియోగదారుడిని అడగకుండా కొత్త ఎత్తు వేస్తున్నారు. లక్ష్యంగా చేసుకున్న వారికి లింకులు పంపించడం ద్వారా టీమ్ వ్యూయర్ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఓ పాస్‌వర్డు చెప్పి యాక్టివ్ చేసుకోవాలని చెబుతున్నారు. బాధితుడు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని యాక్టివేట్ చేసిన వెంటనే ఫోన్ స్క్రీన్ సైబర్ నేరగాడి ల్యాప్‌టాప్‌లో కనిపిస్తుంది. ఫలితంగా వచ్చిన ప్రతీ ఓటీపీని అడగాల్సిన పని లేకుండానే వీలైనంత వరకు ఖాతా ఖాళీ చేయడానికి ఆస్కారం ఏర్పడుతోంది.

పకడ్బందీ పరిశోధనతోనే..

ఒక్కసారి బాధితుడి ఖాతా నుంచి ఖాళీ అయిన డబ్బులు రాబట్టడం అంత సులభమేమి కాదు. తెలంగాణ పోలీస్ యంత్రాంగం సైబర్ నేరగాళ్లకు సంకెళ్లు వేసేందుకు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన, శిక్షణ కల్పించింది. ఫిర్యాదు అందిన వెంటనే బాధితుడు పోగొట్టుకున్న డబ్బు ను రాబట్టడంపై దృష్టి సారిస్తున్నారు. అనంతరం నేరస్తులు వినియోగించిన సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా బాధితుడి ఖాతా నుంచి డబ్బు ఎక్కడికి బదిలీ అయింది..? ఆన్‌లైన్ షాపింగ్ జరిగితే ఏ చిరునామాకు వస్తువు, సామగ్రిని ఆర్డర్ చేశారు..? తదితర వివరాల ఆధారంగా దర్యాప్తు చేస్తారు.

11యాప్‌లు గుర్తించాం..



సైబర్ నేరగాళ్లు ఉపయోగించే 11యాప్‌లను గుర్తించాం. వీటిని ఇన్‌స్టాల్ చేసుకుని పాస్‌వర్డు సైబర్ నేరగాళ్లకు చెబితే మన ఫోన్ వారి యాక్సెస్‌లోకి వెళ్తుంది. ఇలాంటి యాప్స్‌ను సైబర్ నేరగాళ్లు వినియోగించాలంటే కచ్చితంగా బాధితుడి ఫోన్ యాక్టివ్‌గా ఉండాలి. స్క్రీన్ లాక్ చేస్తే నేరగాళ్లు యాక్సెస్ చేయలేరు. అందుకే వీటిని వినియోగించి టోకరా వేసే సైబర్ క్రిమినల్స్ ఆ సమయంలో బాధితులకు ఫోన్ చేసి మాటల్లో ఉంచుతారు. అపరిచితులు పంపే లింకులు ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. బ్యాంకర్లు ఫోన్లు చేయరు, వ్యక్తిగత సమాచారం అడగరని గుర్తుంచుకోవాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

లక్ష్యాన్ని సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ ఉండాలి

- బీహార్ పరిపాలనా విభాగం ముఖ్య కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్



పాఠశాలలో మాట్లాడుతున్న రాజేందర్

బోథ్: కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని బీహార్ రాష్ట్రంలో పరిపాలన విభాగం ముఖ్య కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్ అన్నారు. బోథ్ మండలంలోని కౌఠబి గ్రామానికి చెందిన రాజేందర్ ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల తన సొంత గ్రామానికి వచ్చిన ఆయన తాను చదువుకున్న పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో తిరుగుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న పథకాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. తాను ఐఏఎస్ కావడానికి తాను పుట్టి పెరిగిన గ్రామం, చదవిన పాఠశాలే కారణమన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు వినాయక్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు బడాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్, సోమేశ్వర్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందమర్రిలో నకిలీ నోట్ల కలకలం



వ్యాపారి వద్ద ఒకే నంబర్‌తో ఉన్న రూ.200 నోట్లు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ఏరియా కూరగాయల మార్కెట్‌లో నకిలీ కరెన్సీ నోట్లు కలకలం రేపుతున్నాయి. హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి పవన్‌కుమార్ చిరు వ్యాపారులకు కూరగాయలు వేసి సాయంత్రం డబ్బులు తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలోనే ఈ నెల 5న కూరగాయల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసుకుని ఇంటికి వెళ్లి లెక్కించే సమయంలో నకిలీ రూ.200 నోట్లు కనిపించాయి. ఒకే నంబరుతో ఉన్న మూడు కరెన్సీ నోట్లు దర్శనమిచ్చాయి. గురువారం రూ.200 నోట్లు మరో రెండు ఆయనకే వచ్చాయి. వీటిపైనా ఒకే నంబర్లు ఉండడం గమనార్హం. మార్కెట్‌లో రూ.200, రూ.500 నోట్లు నకిలీవి చెలామణి అవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ నోట్ల విషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. వ్యాపారి పవన్‌కుమార్‌కు నకిలీ నోట్లు వచ్చాయని తెలిపాడని, ఆ నోట్లను తీసుకుని రావాలని సూచించగా రాలేదని పేర్కొన్నారు. నకిలీ నోట్లపై పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

బాలింత అదృశ్యం

- మూడు రోజుల క్రితం ఆడపిల్ల జననం
- శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించని తల్లి
- నిర్మల్ మాతాశిశు ఆస్పత్రిలో ఘటన



నాగమణి

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రి నుంచి బాలింత శుక్రవారం అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలం అస్గుల్ గ్రామానికి చెందిన నాగమణి మూడు రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈమెకు భర్త సాయినాథ్, ఇదివరకే ఒక పాప, బాబు ఉన్నాడు. భర్త వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి బిడ్డ ఆరోగ్యంగానే ఉనానరు. అయితే మధ్యాహ్నం తర్వాత నుంచి నాగమణి కనిపించలేదు. దీంతో బంధువులు ఆస్పత్రి ఆవరణలో వెతికారు. ఆచూకీ లేకపడంతో భర్త సాయినాథ్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి సీసీ పుటేజీలను పరిశీలించారు. ఇందులో నాగమణి తానే స్వయంగా బెడ్ మీది నుంచి ఆస్పత్రి బయటకు వెళ్లినట్లు రికార్డు అయింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి



వివాహిత మృతదేహం వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న తహసీల్దార్, ఎస్సై

దస్తురాబాద్: వరకట్న వేధింపులకు జిల్లాలో మరో వివాహిత బలైంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన సంద నాగరాజుకు జగిత్యాల జిల్లా సారాంగపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన లతతో ముడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 15 నెలల కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా భర్త నాగరాజు, అత్త, మామ సంద సత్తవ్వ, వెంకటి అదనపు కట్నం తేవాలని లతను వేధిస్తున్నారు. వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం బాత్‌రూంలో ఉరివేసుకుంది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ నావాజ్ సర్ఫరాజ్ చేరుకుని పంచనామా చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతురాలి తల్లి పోగుల మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలప తరలించిన ముగ్గురికి రిమాండ్



జైలు వద్ద నిందితులతో అటవీ అధికారులు

కడెం: ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జితిన్ కుమార్ ఈనెల 6న ఇచ్చిన తీర్పు మేరకు ముగ్గురు కలప నిందితులను 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఉడుంపూర్ ఎఫ్‌ఆర్వో అనిత తెలిపారు. మొత్తం ఏడుగురు నిందితుల్లో నలుగురు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. కుంట పవన్, మేడిశెట్టి మహేశ్, తనుగుల దుర్గయ్యను రిమాండ్ నిమిత్తం జిల్లా కేంద్రంలోని సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

కాసిపేట: కాసిపేట పోలిస్‌స్టేషన్ పరిధిలోని పాత బెల్లంపల్లి క్రాసింగ్ సమీపంలో శుక్రవారం సాయంత్రం కారు ఢీకొని లంబాడితండాకు చెందిన ధరావత్ తిరుమల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రహదారిపై లంబాడితండా నుంచి పాతబెల్లంపల్లి వైపు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఎగిరి డివైడర్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కుక్క పిల్లలకు బారసాల



బారసాల చేస్తున్న రవి కుటుంబ సభ్యులు

కడెం: నిర్మల్ జిల్లా కడెం మండలం చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గిరివేణి రవి తన ఇంట్లో కుక్క పిల్లలకు శుక్రవారం బారసాల చేశాడు. రవి పెంచుకుంటున్న కుక్క ఇటీవలే మూడు పిల్లలకు జన్మనిచ్చింది. శుక్రవారానికి అవి పుట్టి 21 రోజులు కావడంతో బారసాల చేశడు. బంధువులను, చుట్టుపక్కల వారిని పిలిచి అందరికీ భోజనాలు పెట్టాడు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని దస్నాపూర్‌గూడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దస్నాపూర్‌గూడ గ్రామానికి చెందిన జవాదే విలాస్ –కవిత దంపతుల కూతురు జవాదే అంజలి(13) బజార్‌హత్నూర్ మండలకేంద్రంలోని కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం తల్లి కవితతో కలిసి వ్యవసాయ చేనులో పత్తి ఏరడానికి వెళ్లింది. సాయంత్రం నీళ్లు తాగి వస్తానని తల్లితో చెప్పి ఇంటికి వెళ్లిన అంజలి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆటోలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. కాగా ఆత్మహత్యపై ఎవరూ ఫిర్యాదు అందలేదని ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన హబీబ్ ఖాన్(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు జైనథ్ ఏఎస్సై ఆత్మారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన హబీబ్‌ఖాన్ తన రెండో భార్య మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. జైలుకు వెళ్లి ఇటీవల బయటకు వచ్చాడు. జైనథ్‌మండలంలోని మేడిగూడలో తన మొదటి భార్య జమీలా పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటుంది. కాగా శుక్రవారం మేడిగూడ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన జేబులో ఉన్న సూసైడ్ నోట్‌లో తన రెండో భార్యను హత్య చేశానని, తనకు జీవించే హక్కు లేదని ఉన్నట్లు ఏఎస్సై తెలిపారు. తన ఆత్మహత్యకు మొదటి భార్య, పిల్లలకు సంబంధం లేదని అందులో రాసి ఉందన్నారు. కాగా భార్య జమీలా తన భర్త కొంత కాలంగా మద్యానికి బానిసై తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, పలుమార్లు నచ్చజెప్పినా వినిపించుకోలేదని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండాకు చెందిన జి.రమేశ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. గ్రామంలోని కిరాణ దుకాణం నిర్వాహకుడు జి.రమేశ్‌కు అదే గ్రామానికి చెందిన సమీప బంధువు గుగ్లావత్ రమేశ్‌నాయక్‌కు పాత గొడవలు ఉన్నాయి. జి.రమేశ్ గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న గుగ్లావత్ రమేశ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. ఈ మేరకు గుగ్లావత్ రమేశ్ తల్లిఇచ్చిన ఫిర్యాదు మేరకు జి.రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలిపారు.